# విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల సాధనలో సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర

**(THE ROLE OF COMMUNITY AND PARENTS IN CHILDREN'S LEARNING ACHIEVEMENT)**


**రచయిత**

మల్లాడి శ్రీనగేష్
సీనియర్ మేనేజర్ - ఎడ్యుకేషన్ - సౌత్ ఇండియా,
సేవ్ ది చిల్డ్రన్.

**ఎడిటింగ్**

డా.ఎస్ . సురేష్ బాబు, కన్సల్టెంట్, స్కూల్ లీడర్షిప్ అకాడమీ,
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ,
హైదరాబాద్.


2022-23


స్కూల్ లీడర్షిప్ అకాడమీ
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్షిప్,
ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL-NIEPA), న్యూఢిల్లీ.

## 1. పరిచయం (Introduction)

సమాజంలో పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి, విద్యార్థులు తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర చాలా ప్రధానమైంది. ఎందుకనగా నాణ్యమైన విద్య అంటే అందరికీ సమాన స్థాయిలో ఎటువంటి వివక్ష లేకుండా అనగా కుల, వర్గ, మత, లింగ, భాష ప్రాంతీయ, ధనిక, పేద, గ్రామ, పట్టణ, సామాజిక వ్యత్యాసం, దివ్యాంగులు లేదా ఎటువంటి సామజిక పరమైన వివక్ష లేకుండా అందరికి కావలసిన వసతులు, బోధనావ్యూహాలను రచించి సమాన విద్యనందిచండం కోసం ప్రతి పాఠశాల ఒక ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలి. ఈ ప్రయత్నంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలో భాగస్వామ్యులైన తల్లిదండ్రులు మరియు సమాజం కూడా తమ ప్రాంత పిల్లల చదువు పట్ల మరియు పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి తప్పనిసరి. ఎందుకనగా పిల్లల భవిష్యత్తు పాఠశాల మరియు సమాజం పైననే ఆధారపడి ఉంటుంది. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం బాలల విద్యలో సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనదని దానికి పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు మరియు స్థానిక సంస్థలు ఒక ప్రధాన భూమిక వహించాలని ఇది చట్టపరమైన నిబంధనగా చట్టంలో సెక్షన్ 21 మరియు 22 లో ప్రధానంగా పొందుపరిచారు.

విద్యా హక్కు చట్టం పాఠశాల యాజమాన్య కమిటీలో పాఠశాల అధికారులు, పిల్లల తల్లిదండ్రులు లేదా వారి సంరక్షకులు మరియు ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని వారిలో 50 శాతం మంది మహిళలు, తల్లిదండ్రులు, బలహీన వర్గాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు పాల్గొని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలనీ మరియు పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వెచ్చించడం వంటి విషయాలు ప్రధాన బాధ్యతగా చట్టంలో పేర్కొన్నారు. అంతేకాక, పాఠశాలను పిల్లలకు స్నేహపూరిత వాతావణంలో ఉండేలా ప్రయత్నించడం, నాణ్యమైన విద్యనందించేలా పాఠశాల యాజమాన్యంతో కలసి పనిచేయడం తద్వారా పిలల్లకు తరగతి మరియు వయసు వారీ విద్యా సామర్థ్యాలను సాధించేలా తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమైనది. అందుకు అందరూ తమ తమ పాత్రలను సమతూకంతో పోషించినప్పుడే పాఠశాలలు అనుకున్న ఫలితాలు సాధించడానికి వెసులుబాటు కలుగుతుంది. అందుకే పాఠశాల అభివృద్ధిలో మరియు నాణ్యమైన విద్యలో వివిధ భాగస్వామ్యుల పాత్రను కూలంకషంగా తెలుసుకోవాలి.

## 2. అధ్యాయం పేరు (Title of the Chapter): విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల సాధనలో సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర - కీలకాంశాలు

## 3. ఈ అధ్యాయం చదవడం వల్ల ముఖ్య ఉద్దేశ్యాలు మరియు సమకూరే లాభాలు (Learning Objectives):

- పాఠశాల నాణ్యమైన విద్యనందించడంలో పాటించాల్సిన ముఖ్యమైన సూత్రాలు
- విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల సాధనలో పాటించాల్సిన వ్యూహాలు
- విద్యార్థుల విద్యా సామర్థ్యాల మెరుగుదలకు ఉపాధ్యాయుల పాత్ర

- విద్యార్థులు తరగతి వారీ విద్యా సామర్థ్యాలు సాధించడానికి తల్లిదండ్రుల పాత్ర, సమాజ ప్రభావం
- విద్యార్థుల్లో స్వీయ అభ్యసనాన్ని (స్వయంసిద్ధంగా చదువుకునే ప్రక్రియను) ప్రోత్సహించడం ఎలా
- సమాజ భాగస్వామ్యంగా వృత్తి పనివారు, యువకులు, పెద్దలు మరియు గ్రామ పంచాయతీ వారు పాఠశాల విద్యా ప్రగతికి ఎలా సహకరించవచ్చు

## 4. ఈ అంశాలను మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి మరిన్ని కీలకాంశాలపై అవగాహన అవసరం. ఈ క్రింది శీర్షికలో ఈ విషయాలను చర్చిద్దాం.

### 4.1. పాఠశాల సందర్శన - విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఉపాధ్యాయులతో సంప్రదించడం (School visit and interact with teachers about their children progress and challenges if any)

తల్లిదండ్రులు తరచూ పిల్లలు చదువుకుంటున్న పాఠశాలను సందర్శించి వారి ఉపాధ్యాయులతో పిల్లల చదువు మరియు ప్రగతి గురించి చర్చించాలి. చదువుకున్న లేదా నిరక్షరాస్యులైన తల్లిదండ్రులైనప్పటికీ వారు ఉపాధ్యాయులను సంప్రదించి వారి పిల్లలు ప్రతి దినం బడికి వస్తున్నారా లేదా బడికి వస్తే తరగతిగదిలో ఎలా వింటున్నారు, అభ్యసనలో పాల్గొంటున్నారా లేక పరధ్యానంగా ఉంటున్నారా యన్న విషయాలను అజమాయిషీ చేయాలి. ఏదైనా పిల్లల గురించి ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిస్తే ఆయా కారణాలను క్షుణంగా పరిశీలించి దానిలో వారి పాత్ర ఉంటే తప్పక ఆయా విషయాలపై దృష్టి సారించాలి. ఉదాహరణకు, తరగతి గదిలో పరధ్యానంగా ఉంటే తన పిల్లలు కుటుంబ విషయాల గురించి యోచిస్తున్నారా లేక చదువు పట్ల ఎందుకు ఏకాగ్రత లోపిస్తుంది వంటి విషయాలపై తన పిల్లలతో చర్చించాలి. తగిన ఉత్సాహాన్నీ - బలాన్ని అందించాలి. ఏదైనా కంటి చూపు లేదా ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టరును సంప్రదించి తగిన చికిత్స చేయించాలి. తమ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యల పట్ల తమ వంతు సలహాతో బలాన్ని అందించాలి

### 4.2. పిల్లల హోమ్ వర్కుకు దోహదపడటం (Support for doing homework)

పిల్లలు బడి నుండి రాగానే వారు సాధారణంగా మిత్రులతో ఆటలాడుకోవడం లేదా కొంత సమయాన్ని వారి ఆనందం కోసం కేటాయించిన తర్వాత పిల్లలతో ఆ రోజు పాఠశాలలో ఏమి జరిగింది, ఏమి నేర్చుకున్నావు మరియు హోమ్ వర్క్ ఏమైనా ఇచ్చారా? హోమ్ వర్క్ పూర్తి చేసారా లేదా అందుకు ఎవరి నుండైనా సాయం అవసరం వుందా లేక తగిన వస్తు సామాగ్రి అవసరముందా వంటి విషయాలను ముచ్చటించాలి. తద్వారా తాను పిల్లల చదువు గురించి మీరు కనబరుస్తున్న శ్రద్ధ, ఆసక్తి వారికి అర్థమయ్యేలా కనబరచాలి. తద్వారా వారి హోంవర్కు పూర్తి చేసేలా సహకరించాలి. నిరక్షరాస్య తల్లిదండ్రులైతే తన తోటి కుటుంబాలలో చదువుకున్న వారు ఎవరైనా ఉంటే వారి సహకారం తీసుకొనేలా తమ పిల్లలకు సహకరించాలి.

## 4.3. పిల్లలకు జీవన నైపుణ్యాలను బోధించడం (To teach life skills)

పిల్లలకు తల్లిదండ్రులు తప్పక జీవన నైపుణ్యానికి సంబంధించిన విషయాలపై మరియు నైతిక విలువలను అలవరచుకొనేలా వారికి అవగాహన కల్గించడం తప్పనిసరి. ఉదాహరణకు ఏది మంచి-చెడు, అబద్ధమాడరాదు, తోటివారిని ప్రేమించాలి, ఎవరితోనూ శత్రుత్వాన్ని కొనసాగించకూడదు, చదువు వల్ల లాభాలు, తోటివారికి సాయపడటం, కులమత వైషమ్యాలను పారద్రోలడం, గురువును అభిమానించడం, పెద్దలను, వృద్ధులను - తల్లిదండ్రులను గౌరవించడం వంటి విషయాలు. దీనికి తోడు పిల్లలకు తమను తాము ఎలా రక్షించుకోవాలి, అపరిచిత వ్యక్తులతో ఎలా జాగ్రత్తగా ఉండాలి, బాల్య వివాహాల వల్ల నష్టాలు,ఇంటి నుండి బడికి - బడి నుండి ఇంటికి వచ్చేటపుడు ఎటువంటి జాగ్రత్తలు వహించాలి వంటి విషయాల పట్ల జాగ్రత్త వహించేలా వారికి విషయావగాహన కల్గించాలి. తద్వారా, పిల్లల్లో జీవన నైపుణ్యాలను అందించడానికి అవకాశం కల్గుతుంది.

- **సమయ పాలన (Time Management):** విద్యార్థులకు సమయం పట్ల నిబద్ధత కలిగి ఉండేలా వారికి అవగాహన కల్గించాలి. సమయం వృథా చేయకుండా సమయాన్ని విలువైనదిగా గ్రహించేలా వారికి వివరించాలి. సమయాన్ని ఎలా వినియోగించాలి మరియు చదువుకోవడానికి, ఆడుకోవడానికి హోంవర్క్ చేయడానికి, మిత్రులతో గడపడానికి, డ్రాయింగ్, పెయింటింగ్ లేదా ఏదైనా అదనపు కృత్యాలకు కేటాయించవలసిన సమయం గురించి వారికి వారే నిర్ణయించుకొనేలా ప్రయత్నించాలి. అందుకు పిల్లలతో చర్చించి తగిన సలహాలను అందించాలి
- **నిర్ణయాలు తీసుకొనే నైపుణ్యాలను అందించడం (Ability to Make Decisions):** తమ పిల్లలకు తల్లిదండ్రులు తమకు తాము నిర్ణయాలు తీసుకొనేలా వారిని తయారుచేయాలి. ధైర్యాన్ని, విషయాలను సుదీర్ఘంగా ఆలోచించేలా చేయడం, క్లిష్ట సమయాల్లో నిబ్బరంగా ఉండి నిర్ణయాలు తీసుకొనేలా వారికి అవగాహన కల్గించాలి.
- **ధనాన్ని సక్రమంగా వినియోగించుకునేలా తయారుచేయడం మరియు కనీస డబ్బు వినియోగానికి ఒక ప్రణాళిక పట్ల అవగాహన కల్గించడం (Money Management skills and basic budgeting):** ధనాన్ని సక్రమంగా, పొదుపుగా వినియోగించేలా వారికి డబ్బు విలువను వివరించడం. ధనాన్ని సంపాదించడం కాదు దానిని సక్రమంగా సద్వినియోగం చేసుకొనేలా వారికి అవగాహన కల్గించడం. ధనాన్ని వృథాగా వెచ్చించకుండా అవసరాన్ని బట్టి ధనాన్ని వినియోగించుకునేలా వారికి ధనం విలువను తెలియపరచాలి. తద్వారా వారికి చిన్న తనం నుండి ధనం విలువ తెలిసి సక్రమంగా వినియోగించుకునేలా వారికి ఒక ప్రణాళిక (ప్లాన్) ఉండేలా వారిని తీర్చిదిద్దాలి.

- **నిబద్ధత-అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా సంసిద్ధుల చేయడం (Resilience and Adaptability):** పిల్లలు ఏ సమస్యనైనా ఎదుర్కొనేలా మరియు ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనేలా పిల్లలను సంసిద్ధత చేయాలి. అంతేగాక, పిల్లలను అందరితోనూ కలసి మెలసి ఉండేలా ప్రోత్సహించడం మరియు అన్ని పరిస్థితులలోనూ ఒదిగిపోయేలా కావలసిన ధైర్యాన్ని-మానసిక స్థైర్యాన్ని అలవరచుకొనేలా చెయ్యాలి.

### 4.4. సరిపడినంత అభ్యసన సామాగ్రిని సమకూర్చడం (Create learning resources)

పిల్లలకు కావలసిన చదువు సామాగ్రిని సమకూర్చాలి. ఉదాహరణకు పేద కుటుంబానికి సంబంధించినవారైతే తమ కుటుంబంలోని అనవసర ఖర్చులను తగ్గించుకొని పిల్లలకు అభ్యసనకు అవసరమైన అదనపు చదువు సామాగ్రిని అనగా చార్టులు, పెన్నులు, పెన్సిల్స్, రంగుల పెన్నులు, నోట్స్ పుస్తకాలు, కథల పుస్తకాలు మరియు ప్రాజెక్ట్ పనులకు అవసరమైన వస్తు సామాగ్రిని సమకూర్చాలి. తద్వారా పిల్లల్లో చదువు పట్ల మరింత ఉత్సాహాన్ని నింపడానికి దోహదపడుతుంది.

### 4.5. పిల్లలు చదువుకొనే మరియు నేర్చుకొనేలా వాతావరణాన్ని కల్పించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునేలా ఒక ప్రత్యేక ప్రాంతాన్ని అనగా చిన్న ఇల్లు అయినప్పటికీ ఒక ప్రత్యేక చోట చాప లేదా కూర్చొని చదువుకునేలా ఒక చోటును ఏర్పరచాలి. అవసరమైతే చిన్నగా పిల్లల ఫొటోలు పెట్టి ఒక ప్రత్యేక చోటుగా గుర్తింపు ఇవ్వాలి. వారికి కావలసిన వస్తు సామాగ్రిని అందించడమే కాకుండా బిగ్గరగా చదివేలా, వ్రాయడం, డ్రాయింగ్, పెయింటింగ్, కథలు చెప్పడం, వార్త పత్రికలు చదవడం, కథల పుస్తకాలు చదవడం, కథలు వ్రాయడం వంటి స్వయంసిద్ధంగా నేర్చుకొనేలా ప్రోత్సహించాలి. దీని ద్వారా పిల్లలు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

### 4.6. పిల్లలకు పాఠశాల, పరీక్షల మరియు ప్రభుత్వ నియమాల గురించి విపులీకరించడం

పాఠశాల మరియు పరీక్షల నియమాల గురించి పిల్లలకు విపులంగా తెలియపరచాలి. నిరక్షరాస్య తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో ఈ విషయాలపై పిల్లలకు పూర్తి అవగాహన కల్గించాలి. ట్రాఫిక్ రూల్స్, ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే అనుసరించాల్సిన నియమ నిబంధనలు, టోల్ ఫ్రీ నెంబర్ మరియు పోలీస్ స్టేషన్ నెంబర్ "100" వంటి సమాచారం పిల్లలకు తెలియపరచాలి.

### 4.7. పిల్లల ఇంటి మరియు పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వామ్యం కావడం (Get Involved)

పిల్లలతో మమేకమై వారి బాగోగులు, ఆసక్తి, వారి సమస్యలు మరియు పాఠశాలలో వారు గడుపుతున్న ఆనందాన్ని మరియు ఎదురవుతున్న సమస్యల గురించి తరచు చర్చించండి. తగిన సలహాలు అందించండి. ఈ ప్రక్రియ వల్ల పిల్లలు తమ పాఠశాల నిర్వహణా ప్రక్రియలో తల్లిదండ్రులు కూడా భాగస్వామ్యం కావడమనే భావన పిల్లలకు భరోసానందిస్తుంది. ఈ విధానం వల్ల పిల్లల దినచర్యలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో ధైర్యాన్ని తెచ్చిపెడుతుంది.

### 4.8. పిల్లలు ప్రతి రోజు బడికి నియమం తప్పక వెళ్లేలా తల్లిదండ్రులు కృషి అవసరం (Take Attendance Seriously)

బడికి హాజరు పిల్లలు తప్పక బడికి హాజరుకావడాన్ని ఒక ప్రత్యేక బాధ్యతగా తల్లిదండ్రులు తీసుకోవాలి. ప్రతి రోజు పిల్లలను బడికి సిద్ధం చేయడం, వారికి సాధ్యమైనంత మేర అల్పాహారాన్ని అందించడం మరియు బడికి సమయానికి చేరేలా జాగ్రత్త వహించాలి. ఒక వేళ కూలీ పని చేసే వారు లేదా స్వంత పనికి వెళ్లే తల్లిదండ్రులు పిల్లల చదువు ప్రాధాన్యతను గుర్తించి భవిష్యత్తులో పిల్లలు తమలాంటి సమస్యలకే పరిమితం కాకుండా తమ పిల్లలకు ఒక గౌరవప్రదమైన మరియు మంచి ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడి మంచి భవిష్యత్తును గడించేలా తల్లిదండ్రులు తమ వంతు కృషి చేయాలి. ఎందుకనగా ప్రభుత్వం పిల్లల చదువుకు పుస్తకాలు, చదువు సామాగ్రి మరియు మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలతో పాటు ఉచితంగా పాఠశాల చదువును అందిస్తుంది. కనుక తల్లిదండ్రులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని తమ పిల్లలు తమ వంతు పాత్ర పోషించాలి.

### 4.9. పాఠశాలకు వెళ్లే పిల్లలకు వారి రోజువారీ చదువు విషయంలో ఒక టైం టేబుల్ ఉండేలా ప్రోత్సహించాలి (Keep a planner)

తల్లిదండ్రులు తప్పక పాఠశాల పిల్లలకు ఒక నిర్ణీత టైం టేబుల్ ఏర్పాటు చేయాలి. చదువుకున్న తల్లిదండ్రులు ఈ టైం టేబుల్ విషయంలో జాగ్రత్తవహించే అవకాశం ఉంటుంది. కానీ నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల విషయంలో పాఠశాలలో ఏర్పరచిన టైం టేబుల్ విషయంలో ఆయా తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో వివరంగా తెలుసుకొని పిల్లలను సంసిద్ధపరచాలి.

**4.10. పిల్లల చదువుకొనే సమయంలో అంతరాయం లేకుండా జాగ్రత్త వహించాలి (Avoid distraction)**

పిల్లలు చదువుకొనే సమయంలో ముఖ్యముగా ఇంట్లో ఎటువంటి అంతరాయం కలగకుండా వారి ఏకాగ్రతను భంగపరిచేలా ఎటువంటి వివాదాలు, గొడవలు, భర్యాభర్తలు తమ సమస్యలపై బిగ్గరగా చర్చించడం, అరవడం మరియు కుటుంబ కలహాలతో పిల్లలను మానసికంగా చింతించేలా చేయరాదు. ఎందుకనగా కుటుంబం కలిసికట్టుగా పిల్లల చదువు, భవిష్యత్తు వారి బాగోగులు ఆధారపడి ఉంటాయి. అందుకు తల్లిదండ్రులు పోషించే పాత్ర పిల్లల చదువు, భవిష్యత్తుపై చాలా ప్రభావాన్ని చూపిస్తాయి. అందుకు పిల్లలు బడి తర్వాత ఇంటి దగ్గర కూడా తమ చదువు ప్రశాంత వాతావరణంలో కొనసాగించేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

**4.11. తోటి విద్యార్థులతో-స్నేహితులతో కలసి అభ్యసన జరిగేలా పిల్లలను ప్రోత్సహించాలి (Encourage peer learning)**

పిల్లల్లో సహ తరగతి లేదా పై తరగతి పిల్లలతో కలసి చదువుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి.పిల్లల రక్షణను దృష్టిలో ఉంచుకొని పిల్లలను జతచేసి ఒకరికొకరు సహకార పద్ధతిలో చదువుకునేలా మరింత ప్రగతి సాధించేలా ప్రయత్నించాలి. అయితే ఈ విధానాన్ని తల్లిదండ్రులు, పెద్దలు తప్పక పర్యవేక్షించాలి. అవసరమైతే వారికీ తల్లిదండ్రులు తమ వంతు సాయాన్ని అందించేలా కృషి చేయాలి.

**4.12. పిల్లల అభ్యసనలో సమాజం యొక్క పాత్ర (The role of community in children learning)**

బాలల భవిష్యత్తు మరియు అభివృద్ధి తరగతి గదిలోనే నిర్మించబడుతుంది గనుక దానికి సంబంధించిన నైపుణ్యాలను ఉపాధ్యాయులకు ఏర్పరచాలని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రధాన అంశాలు ఏమనగా బాలల్లో పెంపొందించాల్సిన శారీరక మానసిక స్థితిగతులను పరిగణనలోనికి తీసుకొని అభ్యసన ప్రక్రియలు రూపొందించడం. దీనికి తోడు కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో విద్యతో పాటు వినోదం మరియు ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థి సంచరించడానికి మరియు విద్యనభ్యసించడానికి కావాల్సిన మరిన్ని భద్రత అంశాలు జోడించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం పాఠశాల యాజమాన్యం మరియు సమాజ బాధ్యత. భవిష్యత్ తరాల బాగోగులు సమాజంపైనే ఆధారపడి ఉంటుందని అందరికీ తెలుసు. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు ఎంతమాత్రం అన్ని విషయాలలో కేంద్రీకరించడం కష్టతరం. ఉపాధ్యాయులను సమాయత్తం చేయడానికి, పాఠశాలలు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగించేలా చూడ్డానికి ముందస్తు ప్రణాళికలు, అదనపు నిధులు చాలా అవసరం. ఇవన్నీ సమ పాళ్లల్లో సమకూరితే, పిల్లల్లో ప్రజ్ఞ వికాసం, చింతన వికాసం, సాంఘిక మరియు ఉద్వేగ వికాసం వంటి విషయాలలో ప్రేరణా ప్రభావంతో పాటు మార్గదర్శకత్వంలో పిల్లల సామర్థ్యాలను, అభిరుచులను గుర్తించి వారి సామర్థ్యాలను వెలికి తీయడానికి తగిన వ్యూహాలను పాఠశాల యాజమాన్యాలు

రచించుకోవాలి. బడి ఈడు పిల్లలనందరని బడి వైపు మళ్లించడానికి చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం, ఆడపిల్లలు మరియు దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక వసతులు ఏర్పాటుకు కృషి చేయడం అందుకు పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను తాయారు చేయడం వంటి ముఖ్యమైన అంశాలు పాఠశాల యాజమాన్యమే కాదు సమాజంలోని అందరూ కలసి కట్టుగా కృషి చేయాలి. పిల్లల ఆరోగ్య సంక్షేమం, పాఠశాలలకు ఎక్కువ వనరులను సమకూర్చి అన్ని పాఠశాలల అభ్యసనా సామర్ధ్యాలను పరిపుష్టి చేయడానికి ఒక చక్కని వాతావరణం ఏర్పాటు చేయడం అనగా అన్ని పాఠశాలలు చైల్డ్ ఫ్రెండ్లీ పాఠశాలలుగా తీర్చి దిద్దబడడానికి సమాజం యొక్క బాధ్యత ప్రధానమైనది. అంతేకాక,చదువు విషయంలో బాలురు లేదా బాలికలు అనే వివక్ష లేకుండా అందరికీ పాఠశాల విద్య అందేలా తల్లిదండ్రులను ఒప్పించడంలో,బాలల చదువు పట్ల ప్రత్యేక ధ్రుష్టి పెట్టడంలో సమాజంలో అందరితో బాటు స్థానిక సంస్థల పాత్ర కూడా ప్రధానమైనది. దీనితో బాటు పిల్లలు పాఠశాలలో చేరిన తర్వాత వారు తప్పక పాఠశాలకు వెళ్లేలా అజమాయిషీ చేయడం, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం మరియు సురక్షిత వాతావరణాన్ని సమకూర్చడం అందరి బాధ్యత.పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు,సమాజం, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వం అందరూ ఉమ్మడిగా కలసి పని చేయాలి. అయితే పిల్లలను పాఠశాలకు పంపించడమే కాదు వారికి కావలసిన సౌకర్యాలు సమకూర్చడంతో బాటు పిల్లల అభ్యసన కూడా ప్రధాన బాధ్యతగా గుర్తించి పాఠశాల ప్రతి విద్యార్థి తరగతి వారీ విద్యా సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులతో బాటు వారి కృషికి తల్లిదండ్రులు, సమాజం మరియు యువత తమ వంతు సాయాన్ని, పాత్రను తప్పక పోషించాలి. విద్యార్థులు విద్యా సామర్థ్యాల సాధనలో సమాజం యొక్క బాధ్యత ఎలా సాధ్యమనేది ఈ క్రింద చర్చించడం జరిగింది.

### 4.13. బాలికల విద్య -ప్రాధాన్యత -సమాజ బాధ్యత (Role of community on girl children education)

సమాజంలో ఆడ పిల్లల చదువు ఇప్పటికీ వివక్ష చూపించడం గమనార్హం. దీనికి చాలా ఉదాహరణలున్నాయి. అవి ఏమనగా, ఆడ పిల్లల భద్రత విషయంలో మరియు వరకట్న సమస్యలు జోడించి చిన్న వయసులోనే ఆడ పిల్లలకూ వివాహం చేసి బాధ్యత తీర్చుకోవాలనుకుంటారు.ఆర్థిక పరిస్థితి మరియు ఆడ మగ వ్యత్యాసం వలన గ్రామాల్లో మగ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించడం ఆడ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపడమనే అంశాలు అనేకం. కరోనా తర్వాత మరియు ముందూ కూడా చాలా మంది పేద కుటుంబాలలో అనగా కూలి మరియు రోజు వారీ ఆదాయాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఆర్థిక స్థోమత లేక తమ పిల్లల చదువును నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాలు అనేకం. దానికి తోడు పాఠశాలల విలీనం వలన ప్రాథమిక పాఠశాలలు తమ ఇంటికి దూరం కావడం మరియు ఉన్నత పాఠశాలలు గ్రామాల్లో దూరంలో ఉండడం అనేది కూడా ఒక కారణం. ఆడ పిల్లలను దూరం పంపించలేక, వారికి భద్రత ఉండదని మరియు తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లే చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆడ పిల్లలను ఇంటిపట్టునే ఉంచుతున్నారు.

మరొక వైపు చిన్న పిల్లలను తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడుగా వారిని పనుల్లో పెట్టడం తద్వారా బాల కార్మికులుగా మార్చడం, చదువుకు దూరం చేయడం, బాల్య వివాహాలు ఇవన్నీ ఆడ పిల్లలకు ఒక శాపంగా పరిణమిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దడం,బడుగు బలహీన కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వ పరంగా సాయం చేయడం ఆడ పిల్లల చదువును ప్రోత్సహించడం మరియు బాల్య వివాహాలను అరికట్టడం, ప్రతి బడి ఈడు గల బాలుడు, బాలిక తప్పక పాఠశాలలో చేరేలా చేయడం, అందరూ చదువు సంపదలను సరి సమానంగా అందుకునేలా సమాజం తన ప్రధాన బాధ్యతగా గుర్తించి తగిన కృషి చేయాలి.

### 4.14. పాఠశాలను సందర్శించడం మరియు పాఠశాల నిర్వహణను పరిశీలించడం (Regular monitoring of schools)

పాఠశాల సమాజంలో ఒక ప్రధాన భాగం-సంస్థ. బాలల భవిష్యత్తు అంతా సమాజంపైనే ఆధారపడి ఉంటుంది. సమాజం బాలలను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడానికి పిల్లలతో మరియు తల్లిదండ్రులతో సమాజ పెద్దలు ముందు చూపుగా వ్యవహరించి ప్రతి కుటుంబంలోని పిల్లలు అందరూ చదువుకుంటున్నారా లేదా బడి బయట ఎంతమంది వున్నారు, ఎవరైనా బాల కార్మికులై బాల్యాన్ని బలి చేసుకుంటున్నారా యనే విషయాలను తప్పక అజమాయిషీ చేయాలి. ఎవరినా పిల్లలు బడి బయట ఉంటే వారిని బడిలో చేర్పించాలి. పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆ పిల్లల తల్లిదండ్రులను కలసి వారిని ఒప్పించి, చైతన్యాన్ని కలిగించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి.

మరొక బాధ్యతగా, బడికి వెళ్లే పిల్లల్లో తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించేలా పాఠశాల యాజమాన్యాలతో చర్చించి అందరి పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా తమ వంతు కృషి చేయాలి. అవసరమైతే తరచూ సమాజ పెద్దలు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు మరియు యువకులు పాఠశాలలో ఎటువంటి అభ్యసనా ప్రక్రియ ఎలా వుంది, ఎంత మంది విద్యార్థులున్నారు, ఎందరు ఉపాధ్యాయులున్నారు, విద్యా హక్కు చట్టం 2009 నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయా లేదా అనే అంశాలను తప్పక పరిశీలించాలి. లోపాలేమైనా ఉంటే వాటిని సరిచేయడానికి పాఠశాల విద్యాశాఖతో కలసి పనిచేయాలి. అభ్యసనా సామర్థ్యాల అజమాయిషీ, పిల్లల ఉపాధ్యాయుల నిష్పత్తికి తక్కువగా ఉంటే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. అంతేకాక తమ వంతు కృషిగా స్థానిక యువతను ప్రోత్సహించి వాలంటీరుగా పిల్లల అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక తరగతులను నిర్వహించడం, అవసరమైతే పాఠశాల అనంతరం అదనపు తరగతులు నిర్వహించడం, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక మద్దతు అందించేలా పాఠశాలకు సహకరించాలి. మరియు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పాఠశాలను మరియు ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలి.

## 4.15. పాఠశాల నమోదు పెరిగేలా ప్రయత్నించడం (Efforts for Increasing attendance in school)

పాఠశాలల్లో చేరిన విద్యార్థులు బడి మానకుండా పాఠశాలకు హాజరు అవుతున్నారా లేదా అన్న విషయాన్నీ సమాజ పెద్దలు, గ్రామపంచాయతీ మరియు యువత పాఠశాల యాజమాన్య కమిటీలతో కలసి పర్యవేక్షించాలి. ఎందుకనగా పాఠశాలలో విద్యార్థుల నమోదు ఎంత వున్నా వారు ప్రతి రోజు తరగతికి హాజరై చదువు చదవకపోతే అభ్యసనలో వెనుకబడి బడి మానేసే ప్రమాదముంది. ఈ పరిస్థితి రాకుండా విద్యార్థుల రాకపోకలను పర్యవేక్షించాలి. వారి ప్రగతి గురించి పాఠశాల ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకోవాలి. హాజరుతో పాటు విద్యార్థుల చదువు, ఆరోగ్యం, వారి భద్రత కూడా పర్యవేక్షించాలి. ఇదే కాకుండా, పాఠశాల పరిశుభ్రత, మంచి నీరు మరియు కావలసిన వసతులున్నాయా యనే విషయాలను పర్యవేక్షించాలి. తద్వారా పిల్లల హాజరు పెరగడం, చదువు నిరంతరంగా సాగించడం వలన సమాజ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థుల ప్రగతిని గురించి అజమాయిషీ చేయడం వలన పాఠశాల ఒక నాణ్యతా దృక్కోణంలో పయనించడానికి దోహదపడుతుంది.

## 4.16. బడి బయట వున్న బడి ఈడు పిల్లలను గుర్తించడం - వారిని బడిలో చేర్పడం -వారు చదువు కొనసాగించేలా పాఠశాల యాజమాన్యంతో కలసి కృషి చేయడం

గ్రామంలో మరియు పాఠశాల పరిధిలో బడి బయట వున్న బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడం మరియు వారికి వయసుకు తగ్గ మరియు తరగతి వారీగా విద్య సామర్థ్యాలు చేకూరేలా పాఠశాల యాజమాన్యంతో కలసి పని చేయాలి. తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్య కమిటీ భాగస్వామ్యులుగా పాఠశాల అభివృద్ధికి మరియు పిల్లల చదువు పట్ల తమ వంతు కృషిగా విద్యా హక్కు చట్టం 2009 పరిధిలో కృషి చేయడం జరగాలి. ఇదొక్క ప్రయత్నమే సరిపోదు-సమాజంలో పెద్దలు, గ్రామ పంచాయతీ మరియు యువత అందరి బాధ్యతగా గుర్తించి కృషి చేయడం తద్వారా బడిలో వున్న పిల్లలందరూ నాణ్యమైన విద్య సమకూరేలా తరచూ పాఠశాలలో అమలు జరుగుతున్న తరగతి బోధనా విధానాలు, ఉపాధ్యాయుల అంకిత భావం మరియు వారు వెనుకబడిన విద్యార్థుల గురించి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వంటి విషయాలపట్ల ఎప్పటికప్పుడు అజమాయిషీ చేయాలి. తగిన సహకారం పాఠశాలకు అందించాలి. తద్వారా బడిలో వున్న పిల్లలు క్రమం తప్పక పాఠశాలకు వెళ్లడం, శ్రద్ధగా చదువుకోవడం, ప్రగతి సాధించడం సాధ్యమౌతుంది.

## 4.17. పాఠశాల ప్రగతి సాధించడానికి కావలసిన భౌతికపరమైన వసతుల ఏర్పాటు (Ensuring physical infrastructure)

పాఠశాల ప్రగతి సాధించడానికి కావలసిన భౌతికపరమైన వసతుల ఏర్పాటు అందుకు ప్రభుత్వ యాజమాన్యాలతో నిరంతరం చర్చించడం, పాఠశాల వార్షిక అభివృద్ధి ప్రణాళిక ద్వారా సరిపడినన్ని వనరులను సమకూర్చడం, పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడం సమాజ బాధ్యత. పాఠశాలకు సరిపడినన్ని

తరగతి గదులు, నీటి సరఫరా, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, ఆట స్థలం, అందరి విద్యార్థులకు పుస్తకాల పంపిణీతో పాటు ప్రభుత్వం పరంగా సమకూరాల్సిన ఆర్థిక సహకారం వంటి విషయాలలో సమాజ బాధ్యత తప్పనిసరి. వారి పాత్ర పాఠశాల రూపాన్నే మార్చి పిల్లలకు ఒక స్నేహపూరిత వాతావరణాన్ని ఏర్పరచడానికి. ప్రయత్నాలు తప్పనిసరి.

### 4.18. బాలల రక్షణ-సమాజ బాధ్యత (Child protection – responsibility of community)

బాలల రక్షణ సమాజ బాధ్యత. పాఠశాలలోనే కాకుండా ఇంటి నుండి బడికి-బడి నుండి ఇంటికి వచ్చేవరకు బాలల రక్షణ సమాజం అనగా తల్లిదండ్రుల మరియు స్థానిక సంస్థల, పోలీస్, ఫైర్, రెవిన్యూ, విద్యాశాఖ మరియు సంబంధిత శాఖల బాధ్యత. అనగా సమాజంలో సంస్థలు, వ్యక్తులు అందరూ వ్యక్తిగత దృష్టిసారించి పాఠశాలలో మరియు గ్రామంలో వున్న పిల్లల రక్షణ ఒక ప్రధాన బాధ్యతగా గుర్తించి తమ వంతు సహకారాన్ని అందించాలి. సమాజం బాలలకు ఓ రక్షణ వలయంగా ప్రతి క్షణం కాచుకొని ఉండాలి. అందుకే బాలల సంరక్షణ సమాజ బాధ్యత, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి సమాజంలో వ్యక్తులందరూ తమ వంతు పాత్రను తప్పక నిర్వర్తించాలి.

### 4.19. పాఠశాలకు సమాజమే ఒక భద్రత (Society as social fencing for school)

పాఠశాలను సమాజం ఒక భద్రతా వలయంగా ఉండి కాపాడాలి. భౌతిక వసతులు వృథా కాకుండా కాపాడడం, పిల్లల బాగోగులు చూడడం, పాఠశాల కొనసాగిస్తున్న బోధనా బాధ్యతలు, ఉపాధ్యాయుల యోగా క్షేమాలు మరియు పిల్లల సంక్షేమం వంటి విషయాలు సమాజ బాధ్యత. అనగా పాఠశాల బాగోగులు మరియు పిల్లల సంరక్షణ, చదువు, అభివృద్ధి విషయంలో సమాజం ప్రధాన భూమిక వహించాలి. సమాజంలో ప్రతి వ్యక్తి పిల్లల భవిష్యత్తు పట్ల అంకిత భావంతో కృషి చేయడం సమాజంలో వున్న గ్రామ పంచాయతీ, యువత, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మహిళలు ఒక్కొక్కరూ పాఠశాల నిర్వహణలో పాఠశాల యాజమాన్య కమిటీకి తమ వంతు సహకారాన్ని అందించాలి.

### 4.20. సామజిక గ్రంథాలయాలు (Community libraries)

సామాజిక గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత పురాతన కాలం నుండి ప్రాచుర్యంలో వున్నాయి. ఈ కాలంలో లభ్యమయ్యే డిజిటల్ మరియు సాంకేతికపరమైన విద్యా సాధనాలు లేనప్పుడు సమాజం సామజిక గ్రంథాలయాలకు వెళ్లి ప్రజలు పుస్తక పఠనం చేసేవారు. సమాజంలో వున్న వివిధ సమాజ ప్రతినిధులకు అనగా పెద్దలకు, పిల్లలకు, మహిళలకు, రాజకీయ మరియు ఇతర జనవాళికి కావలసిన పుస్తకాలను గ్రంథాలయాల్లో పొందుపరచేవారు. నియమం తప్పక గ్రంధాలయం తెరవడం మరియు అందరూ సేవలను అందుకునేలా గ్రంథాలయాలను తీర్చి దిద్దేవారు. ఈ కాలం కూడా సామజిక గ్రంథాలయాలను ఏర్పరచి అనగా పుస్తక పఠన మరియు డిజిటల్ గ్రందాయాలను వినియోగించుకునేలా యువతను, పిల్లలను ప్రోత్సహించాలి.

సమాజంలో ముఖ్యముగా గ్రామ యువతకు, పిల్లలకు పుస్తక పఠనం అనేది ప్రధానం. పఠనం లోపిస్తే విజ్ఞానం లభించదు మరియు విషయం చదవడం, అవగాహన చేసుకోవడం, నేర్చుకున్న విషయాన్ని తమ జీవితాలకు అన్వయించుకోవడం తద్వారా జీవన నైపుణ్యాలను అలవరచుకోవడం తప్పనిసరి. ఇందుకు గ్రంథాలయాలు ప్రధాన భూమిక వహిస్తాయి. అందుకు సామజిక గ్రంథాలయాలు పాఠశాలల్లో లభించే పుస్తక విజ్ఞానానికి అదనంగా విజ్ఞానాన్ని సముపార్జన చేసుకొనే వెసులుబాటు ఉంటుంది.

### 4.21. పిల్లల చదువు పెంపొందించడానికి సామజిక కేంద్రాలను ఏర్పరచడం (Setting Up Community Centers)

పిల్లల ప్రగతి తల్లిదండ్రులపైన మరియు సమాజంపై ఆధారపడి వుంది. దీనికి సమాజంలో ఉన్న ప్రజలు, యువత మరియు మహిళలకు పిల్లల చదువు గురించి శ్రద్ధ వహించేలా చైతన్యాన్ని కల్పించడం మరియు వారికి కూడా వివిధ సామాజిక విషయాలపై విజ్ఞానాన్ని అందించడం ప్రధానాంశం. దానితో బాటు పిల్లలకు పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ఒక కేంద్ర బిందువుగా ఒక అభ్యసన కేంద్రాన్ని ఏర్పరిస్తే, ఈ కేంద్రం సమాజానికి, పిల్లలకు మరియు మహిళలకు ఉపయోగపడుతుంది. ఈ కేంద్రాన్ని సమాజం తమ పర్యవేక్షణలో నడిపించడం ప్రధానాంశం. అందరూ ఉపయోగపరచుకొనేలా మరియు ఎటువంటి అసాంఘీక కార్యక్రమాలకు వినియోగించకుండా ఒక పవిత్ర ప్రదేశంగా ఉపయోగించేలా సమాజ/ గ్రామ పెద్దలు స్వయంప్రతిపత్తి కలిగేలా వాటి నియమాలను ఏర్పరచాలి. ఈ కేంద్రంలో పిల్లల చదువు-తదనుగుణమైన కార్యక్రమాలకు అందుబాటులో ఉంచాలి.

### 4.22 పిల్లల చదువులో తల్లిదండ్రులను పాల్గొనేలా చేయాలి (Involving Parents in the Child’s Education)

పిల్లల చదువు-అభివృద్ధి తల్లిదండ్రులపైనే అనగా వారు చూపించే శ్రద్ధ -పర్యవేక్షణ, కల్పించే అవకాశాలు విద్యార్థుల ప్రగతిపై ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రులు అక్షరాస్యులైనా-నిరక్షరాస్యులైనా వారు పిల్లల పట్ల, వారు పాఠశాలలో కనబరిచే ప్రతిభ పాటవాల పట్ల అవగాహన కలిగివుండాలి. తమ పిల్లలు బడికి వెళ్తుంటే ఎలా చదువుతున్నారు. పాఠశాలలో ఎలా మెలుగుతున్నారు, ఉపాధ్యాయులకు విద్యార్థుల మధ్య సత్సంబంధాలు ఎలా వున్నాయి యనే విషయాలను పాఠశాల ఉపాధ్యాయులతో కలసి చర్చించాలి. అవసరమైతే తమ పిల్లలు విద్యా సామర్థ్యాలలో వెనుకబడి ఉంటే వారిని తీర్చి దిద్దడానికి తగిన సలహాలను, మెలకువలను, తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు నిర్వహించాల్సిన కార్యక్రమాలను అడిగి తెలుసుకోవాలి. అంతేకాక తమ పిల్లలకు కావలసిన చదువు సామాగ్రిని సమకూర్చడం , తరచూ పర్యవేక్షించడం తప్పనిసరిగా పరిశీలించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సాధారణంగా తమ పిల్లల చదువు పాఠశాల బాధ్యత అని తల్లిదండ్రులు భావిస్తారు. కానీ పిల్లలు తమ చదువు, మరింత ప్రగతి సాధించడానికి తల్లిదండ్రుల బాధ్యత చాలా కీలకమైనది. ఈ విషయాలను అవగాహన చేసుకొని పాఠశాల యాజమాన్యాలతో తరచూ తమ పిల్లల చదువు గురించి పర్యవేక్షణ, అవగాహన, అవసరమైన సహకారాన్ని అందించడం తల్లిదండ్రుల పాత్రగా గుర్తించాలి.

## 4.23. పిల్లలు ఎదుర్కొను సమస్యలను తగ్గించేలా ప్రయత్నించాలి (Addressing the Child's Vulnerabilities)

తల్లిదండ్రులు పిల్లలు ఎదుర్కొనే సమస్యలను అనగా తరచూ అనారోగ్యానికి గురికావడం, దృష్టి సంబంధ సమస్యలు, మానసిక శారీరక సంబంధ ఇబ్బందులు మరియు ప్రత్యేకించి ఆడ పిల్లలు ఎదుర్కొనే ప్రత్యేక ఆరోగ్య పరమైన మరియు మానసిక సంబంధ సమస్యలను అడిగి తెలుసుకోవడం, తగిన వైద్యం అందించడం, తరచూ పిల్లల బాగోగుల గురించి చర్చించడం చేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ఎంత ఎక్కువ సమయం గడిపితే అంత ఉత్సాహంగా పిల్లలు తమ చదువు పట్ల శ్రద్ధ వహిస్తారు. పిల్లలు తమ సమస్యలను వ్యక్తపరచకపోయినా తల్లిదండ్రులు చొరవతో గ్రహించి తమ పిల్లలకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలి.

## 4.24. విద్యార్థులకు అనువైన బోధనా విధానాలను పాటించేలా పాఠశాల యాజమాన్యాలను ప్రోత్సహించవచ్చు (Maintaining a Flexible Pedagogical Approach)

పాఠశాల నిర్వహణలో మరియు పిల్లలకు అందించే చదువు, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న తరగతి గది నిర్వహణ వంటి విషయాలు తరచూ ఉపాధ్యాయులతో చర్చించడం-తమ పిల్లలు అభ్యసనలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడం ప్రధానం. దీనికి తోడు తమ పిల్లలకు అర్థమయ్యే పద్ధతిలో అభ్యసనా ప్రక్రియలు అనుసరించేలా పాఠశాల యాజమాన్యాలను కోరడం వంటి విషయాలు పాఠశాలకు, విద్యార్థుల ప్రతిభకు ఎంతో ఉపకరం. ఈ ప్రక్రియల ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులు స్థాయిని గుర్తించి స్థానికతను జోడించి బోధనా ప్రక్రియను మరియు పిల్లలకు అనువైన బోధనా పద్దతులను పాటించేలా పాఠశాల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను విధిగా కోరవచ్చు.

## 4.25. Nurturing Community Experts (సమాజంలో వున్న స్థానిక జ్ఞానాన్ని-అనుభవాలను పాఠ్యంశాలతో జోడించాలి)

సమాజంలో విద్యా రంగంలో అనుభవజ్ఞులైన పెద్దల మరియు వివిధ గ్రామీణ వృత్తి రంగాలలో నిష్ణాతులైన పెద్దలను పాఠశాలకు పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా ఆహ్వానించి వారి అనుభవాలను మరియు వారికున్న నైపుణ్యాల గురించి విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించేలా కృషి చేయాలి. దీని ద్వారా వ్యవసాయం, పాడి పరిశ్రమ, కమ్మరి, కుమ్మరి, పట్టుపురుగుల పెంపకం, వివిధ వ్యవసాయాధార వృత్తులు మరియు స్థానిక అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు మరియు మహిళల అనుభవాలను పాఠ్యంశాలకు జోడించి బోధించేలా సహకరించాలి. దీని ద్వారా బాలలకు అనుభవాత్మక విద్య అందుతుంది. తద్వారా జీవన నైపుణ్యాలు మెరుగవుతాయి. ఈ ప్రక్రియలో సమాజం/ తల్లిదండ్రుల పాత్ర చాలా ప్రధానమైనది.

### 4.26. ప్రతి వారం విద్యార్థులతో కథలు వల్లింపచేయడం - తద్వారా పఠనా శక్తిని మరియు వినడం, అర్థం చేసుకోవడం అనే ప్రక్రియలను ప్రోత్సహించడం (Weekly story telling festivals)

విద్యార్థుల్లో చదవడం మరియు వినడం అనే ప్రధాన ప్రక్రియలో కథలు చదవడం, చెప్పడం అనేవి ప్రధానమైనవి. ఈ ప్రక్రియ సమాజం గ్రామాలలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రతి వారం ఒక వారం కథలు పలువురి పెద్దల మధ్య చదవడం, చదివేటప్పుడు తప్పొప్పుల సరిదిద్దడం చేస్తూ విద్యార్థులలో పఠనా శక్తిని పెంపొందించవచ్చు. ఈ ప్రక్రియ వల్ల చిన్న మరియు పెద్ద తరగతి పిల్లలు చదవడం, వినడం మరియు అవగాహన చేసుకునే ప్రక్రియలో నైపుణ్యాలను పొంపొందించేందుకు వీలవుతుంది. ఇందుకు సమాజం, సమాజంలో పెద్దల సహకారం మరియు చొరవ చాలా అవసరం.

### 4.27. సామాజిక-పఠన మిత్రులు (Community reading buddies)

సమాజ స్థాయిలో గ్రామ పెద్దలు పాఠశాల యాజమాన్య కమిటీ సహకారంతో పిల్లల కోసం కమ్యూనిటీ రీడింగ్ బడ్డీస్ పేరిట పిల్లల చదువు సామర్ధ్యాలను పెంపొందించవచ్చు. పెద్ద తరగతి నుండి చిన్న తరగతి పిల్లలను సమీకరించి గ్రామ పెద్దలు వారి పర్యవేక్షణలో పిల్లలను చదివించడం, పెద్దలు కూడా పిల్లల కోసం చదవడం, పిల్లలు చదువుచున్నపుడు తప్పొప్పులను సరిద్దిదడం ద్వారా పిల్లలకు ప్రతి వాక్యాన్ని, పేరాలను, పుస్తకాలను తప్పులు లేకుండా చదివేలా ప్రోత్సహించడం ఒక ప్రధాన ప్రక్రియగా సమాజ పెద్దలు మరియు పాఠశాల యాజమాన్య సభ్యుల సహకారంతో కృషి చేయాలి.

### 4.28. పాఠశాల మరియు పరిసరాల పరిశుభ్రత  సమాజ బాధ్యత

ఈ ప్రక్రియలో గ్రామాలలో చైతన్యాన్ని తీసుకువచ్చేలా కృషి చేయాలి. పరిశుభ్రతా చైతన్య కార్యక్రమాలు (Cleaning campaign) చేపట్టాలి.

పాఠశాల భద్రత మరియు పరిశుభ్రత సమాజానిదే. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యాలయ యాజమాన్యం పాఠశాల పురోగతి, విద్యార్థుల భద్రత, మంచినీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, పిల్లలకు పరిశుభ్ర వాతావరణంలో పాఠశాల నిర్వహించేలా కృషి చేయాలి ఈ ప్రక్రియలో సమాజంలో గ్రామ పెద్దలు పంచాయతీ కార్యాలయాన్ని ఈ సౌకర్యాల కల్పనలో ఎటువంటి జాప్యం, అలసత్వం లేకుండా జాగ్రత్త వహించాలి. పాఠశాల భద్రత, పిల్లల సంక్షేమం, రక్షణ, అజమాయిషీ, పాఠశాల నాణ్యమైన విద్యనందించేలా అజమాయిషీ చేయడం, బడి బయట వున్న పిల్లలను పాఠశాలకు తీసుకురావడం వంటి ముఖ్యమైన బాధ్యతలు సమాజానికి వున్న ప్రధాన లక్ష్యం.

### 4.29. తల్లిదండ్రులు నియమం తప్పక పాఠశాల యాజమాన్యంతో తమ పిల్లల ప్రగతి గురించి చర్చించాలి (Frequent interaction with teachers and students for the feedback)

తల్లిదండ్రులు తరచూ తమ పిల్లలు చదువుతున్న పాఠశాలను సందర్శించడం, తమ పిల్లల చదువు మరియు వారి ప్రగతి గురించి ఉపాధ్యాయులతో చర్చించాలి. వారి అభ్యసనలో లేదా పాఠశాలలో తాను చదువుతున్న తీరును, తమ పిల్లలు తోటి మిత్రులతో మెలుగుతున్న తీరును గురించి వివరాలు తెలుసుకోవడం తద్వారా పిల్లల చదువు పట్ల తగిన శ్రద్ధ కనపరచటం తప్పనిసరి. తల్లిదండ్రుల అజమాయిషీ వలన పిల్లల్లో ఉత్సాహం మరియు పాఠశాల యాజమాన్యంలో ఒక బాధ్యత ఏర్పడుతుంది. పిల్లల చదువు-అభ్యసనలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని తేటతెల్లమౌతుంది. అందుకు తల్లిదండ్రులు తరచూ పాఠశాల సందర్శన-పిల్లల చదువు విషయాల గురించి వాకబు చేయడం-తగిన సహకారాన్ని పాఠశాలలో అందేలా కృషి చేయడం మరియు ఇంటి దగ్గర కూడా తగిన శ్రద్ధ అనగా చదువు పట్ల శ్రద్ధ తీసుకోవడం, చదువు సామాగ్రిని సమకూర్చడం తప్పనిసరిగా గ్రహించాలి.

## ముగింపు

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల సాధనలో సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర చాలా ప్రధానమైనది. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల వారి అభ్యాసన పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దీనికి పాఠశాల యాజమాన్య కమిటీలు మరియు స్థానిక సంస్థలు ఒక ప్రత్యేక ప్రణాళిక ప్రకారం పాఠశాల అభివృద్ధికి పాటుపడాలి. పాఠశాల అభివృద్ధి అనగా పిల్లల అభ్యసనా సామర్థ్యాలు మరియు వారి ప్రగతి ప్రధానాంశాలుగా గ్రహించాలి. దీనికి ఉపాధ్యాయ బృందాలు తల్లిదండ్రులతో మమేకమై పిల్లల ప్రగతి గురించి చర్చించి, వారి విద్యా సామర్థ్యాల గురించి సరైన ప్రణాళికలు రచించి అమలుకు ఉమ్మడిగా  కృషి చేయాలి. ఈ దిశగా అందరు తప్పక కృషి చేయాలి.

## మూల్యాంకనం

1. పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్యాలు ఎందుకు సత్సంబంధాలు కలిగి ఉండవలసిన ఆవశ్యకత ఏమిటి?
2. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు సాధించడానికి తల్లిదండ్రుల పాత్ర ఎలా ఉండాలి?
3. సామాజిక పఠన మిత్రులు (Community reading buddies) అంటే ఏమిటి? వివరించండి.

## రిఫరెన్సులు


1. School Management Committee Module
2. New Education Policy and the role of Parents
3. Disha-Module on Inclusion
4. Field experience

# అనుబంధం

**దృష్టాంతం-1: పూర్వప్రాథమిక విద్యలో కనీస అక్షరాస్యత కూడా లేని తన కుమార్తె కోసం తలిదండ్రుల అద్భుత కృషి!**

ఒడిశా రాష్ట్రంలో, బౌధ్ జిల్లాలో గల మన్మూంద గ్రామ పంచాయతీ మరియు బ్లాకు పరిధిలో 4 సంవత్సరాలు వయసు గల స్నేహాంశికకు ఆమె తలిదండ్రులు చదువుకోక పోయినప్పటికీ ఆమె కుమార్తెకు ఇంటి దగ్గర కుడా పూర్వ ప్రాథమిక విద్యనందించడానికి ఎలా కృషి చేసారో తెలుసుకుందాం.

కోవిడ్ కారణంగా అంగన్వాడీ కేంద్రాలు మూసివేయడం వలన పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య దూరమైంది. కానీ తలిదండ్రులు అంతగా చదువుకోలేదు. తండ్రి మెకానిక్ గా పనిచేస్తున్నారు, తల్లి ఇంటిని చక్కదిద్దుకుంటుంది. ఈ నేపథ్యంలో తమకు తమ కుమార్తెను చదివించాలని గాని, అంగన్వాడీకి పంపిస్తే పూర్వ ప్రాథమిక లభిస్తుందని తెలియదు సరికదా! అంగన్వాడీ కేంద్రాలు కరోనా కారణంగా మూతపడడం వలన తమ కుమార్తెకు పూర్వ ప్రాథమిక విద్య అందడం లేదనే ఆందోళన ఎంతమాత్రం లేదు. కానీ కోవిడ్ సమయంలో సేవ్ ది చిల్డ్రన్ సంస్థ ఇచ్చిన ప్రోత్సహం మరియు చైతన్యం వలన స్నేహాంశిక తలిదండ్రులలో చక్కటి మార్పు వచ్చింది. సేవ్ ది చిల్డ్రన్ తయారు చేసి వాట్సాప్ ద్వారా అందించిన గుల్మొహర్ పేర రూపొందించిన డిజిటల్ పాఠాల ద్వారా తన బిడ్డకు తమ ఇంట్లో వున్న వస్తువుల సాయంతో పూర్వ ప్రాథమిక విద్యలో ప్రధానమైన చిన్న చిన్న లెక్కలు, భాషా పరమైన విషయాలను అట పాటల ద్వారా బోధించడం మొదలుపెట్టారు. అంతే కాక అమ్మాయికి సేవ్ ది చిల్డ్రన్ సంస్థ అందించిన ఈ.ఎల్.ఎం. మాడ్యూల్ అనగా ఫౌండషనల్ అక్షరాస్యత మరియు గణితం తలిదండ్రులు సాంప్రదాయ విధానంలో కార్డుల ద్వారా శిక్షణాధారంగా తమ బిడ్డకు పూర్వ ప్రాథమిక విద్యను బోధించడం మొదలు పెట్టారు. అంతేకాక మట్టితో లేదా సులభంగా లభించే వస్తువులు, సామాగ్రితో ఈ విషయాలను బోధించడం ఒక పెద్ద మార్పుయని చెప్పవొచ్చు. దీనికి స్థానిక అంగన్వాడీ వర్కర్ సాయం మరియు 'సేవ్ ది చిల్డ్రన్' ప్రతినిధుల సలహాలు ఉన్నప్పటికీ తల్లిదండ్రుల చొరవ మరియు వారు ఇసుకతో ఏర్పరచిన చేతితో వ్రాసుకొని చలనాత్మక నైపుణ్యాలు (motor skills) పెంపొందించడం, స్క్రిబ్లింగ్ స్పేస్ - గోడనే ఒక నల్ల బల్లగా మలచి తమ కుమార్తె తనకు నచ్చిన విధంగా గీతలు గీయడం, చిత్రాలు గీయడం లేదా తన చేతిని వివిధ రకాలుగా తీర్చి దిద్దడానికి తలిదండ్రులు చేసిన కృషి నిజానికి ఓ పెద్ద మార్పు!!

పూర్వ ప్రాథమిక స్థాయిలో తమ కుమార్తెకు తలిదండ్రులు ఖర్చు లేకుండా తమ బిడ్డను తీర్చిదిద్దేందుకు వారు చేసిన కృషి అభినందనీయం. ఇలా ప్రతి తలిదండ్రులు ఎల్లప్పుడు ఈ ప్రయత్నాలు ముమ్మరం చేస్తే పిల్లల నైపుణ్యం మెరుగుపరచడం ఎంతో సులభం!!

**దృష్టాంతం-2: ఓ తల్లి తన పిల్లల చదువు - ప్రగతి కోసం శ్రమించిన తీరు!! ఆర్.కె. కాలనీ, కరీంనగర్ కథనం!!**

ఇదే రీతిగా పాఠశాల విద్యార్థుల కోసం కూడా తలిదండ్రులు తెలుగు రాష్ట్రాల్లో కూడా తమ పిల్లల చదువు కొనసాగింపు కోసం ఎన్నో ప్రయత్నాలు చేసారు. ఉదాహరణకు కరీంనగర్ జిల్లాలో ఆర్.కె.కాలనీ ప్రభుత్వ పాఠశాల పరిధిలో కమలమ్మ అనే మహిళ తాను చదువుకోనప్పటికీ తమ ఇద్దరు పిల్లల చదువు కరోనా కారణంగా సన్నగిల్లకూడదని, తానే స్వయంగా ఫోన్ ద్వారా ఉపాధ్యాయులను సంప్రదించడం, తమ పిల్లలకు సందేహ నివృత్తి చేయించడం, అవసరమైన చదువు సామాగ్రిని తీసుకు రావడం, స్థానికంగా తమ ఇంటిప్రక్కనే వున్న యువకుల మరియు చదువుకున్న వారిని సంప్రదించి తమ పిల్లల చదువుకు నిరంతర కృషి చేయడం ఒక చక్కటి విషయం. ఆమె 'సేవ్ ది చిల్డ్రన్' మరియు 'సమగ్ర శిక్షా' నిర్వహించిన ఒక జాతీయ వెబినార్ లో తమ పిల్లల చదువు పట్ల సాధారణ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంపై మాట్లాడుతూ ఆమె తరచూ పాఠశాల సందర్శించడం, ఉపాధ్యాయులతో తమ పిల్లల చదువు, బాగోగుల గురించి చర్చించడం, అవసరమైన సలహాలు తీసుకోవడం, ఇంటి వద్ద పిల్లలకు చదువుకునేలా చక్కటి వాతావరణాన్ని ఏర్పరచడం, అవసరమైన చదువు సామాగ్రి అందించడం మరియు ముఖ్యముగా పిల్లల చదువు పట్ల తరచుగా అజమాయిషీ చేస్తూ పిల్లలు మంచి ప్రగతి సాధించేలా కృషి చేయడం తలిదండ్రుల పాత్ర ముఖ్యమని నొక్కి వక్కాణించింది!! అందుకు తల్లిదండ్రులు, సమాజం పిల్లల విద్య విషయంలో ప్రగతిలో ప్రధాన భూమిక వహించాలన్నది ప్రధానాంశంగా అందరూ గుర్తించాలి.